ప్రజల్లో భయం.. సన్నద్ధత శూన్యం

- ఇటీవల జిల్లాలో కరోనా కేసుల నమోదు
- ముందస్తు చర్యలు తీసుకోని సర్కార్
- ఎమ్మిగనూరు ఆస్పత్రిలో పని చేయని ఆక్సిజన్ ప్లాంట్
- ఆసుపత్రుల్లో వైద్యులే ముందస్తు చర్యలు తీసుకుంటున్న వైనం



ఎమ్మిగనూరులోని వైద్య విధాన పరిషత్ ప్రాంతీయ వైద్యశాల


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేయగా నేడు పనిచేయని ఆక్సిజన్ ప్లాంట్

ఎమ్మిగనూరుటౌన్: కోవిడ్ 19 మహమ్మారి ప్రపంచాన్నే కుదిపేసింది. విలయతాండవం చేసి కొందరిని బలిగొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. అయితే ప్రస్తుతం మళ్లీ కరోనా మరోసారి కోరలు చాస్తుందంటూ రాష్ట్రంలో, జిల్లాలో కేసులు నమోదవుతున్నట్లు వస్తున్న వార్తలతో జనాలను ఆందోళనకు గురిచేస్తుంది. ప్రజల్లో ఓ వైపు భయాందోళనలు నెలకొంటున్నాయి. అయితే కూటమి సర్కార్ మాత్రం ముందస్తు జాగ్రత్తలు, చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలోని ఆక్సిజన్ ప్లాంట్‌కు మరమ్మతులు కూడా చేయించడం లేదు. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులే కొన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

స్థానికంగానే ముందస్తు చర్యలు

ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు చర్యలు లేకపోయినప్పటికీ నియోజకవర్గ కేంద్రమైన ఎమ్మిగనూరులో వైద్య విధాన పరిషత్ ప్రాంతీయ వైద్య శాలతో పాటు గోనెగండ్ల, నందవరం మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో ప్రాంతీయ వైద్యశాలలో 50 పడకలుండగా అందులోని ఓ వార్డులో 14 పడకలను కోవిడ్ వార్డుగా వైద్యులు ఏర్పాటు చేశారు. ఇందులో 15 పెద్దవి, 5 చిన్న ఆక్సిజన్ సిలిండర్లు, 10 కాన్సన్‌ట్రేటర్స్ అందుబాటులో వుంచినట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రిలో వివిధ వైద్య విభాగాలకు చెందిన 14 మంది వైద్యులతో పాటు సిబ్బంది పనిచేస్తున్నారు. గతంలో కోవిడ్ వచ్చిన సమయంలో ఈ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు పంపించారు. కాగా కోవిడ్ కిట్లు ప్రస్తుతం కాలపరిమితి అయిపోతునందున కొత్త వాటి కోసం ఇండెంట్ పెట్టినట్లు వైద్యులు తెలిపారు.

గోనెగండ్ల ఆస్పత్రిలో..

అదేవిధంగా గోనెగండ్ల ప్రాథమిక వైద్య కేంద్రంలో కోవిడ్ వ్యాపిస్తే చికిత్స అందించేందుకు 6 బెడ్లు ఏర్పాటు చేశారు.ఆస్పత్రిలో రెండు ఆక్సిజన్ సిలిండర్లు,3 కాన్సన్ ట్రేసర్లు,ఒక వైద్యురాలు,13 మంది సిబ్బంది అందుబాటులో వున్నారు.

మరమ్మతులకు నోచుకోని ఆక్సిజన్ ప్లాంట్

ఇటీవల జిల్లాలో నమోదైన కోవిడ్ కేసుల్లో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గానికి చెందిన వారు ఉడటం ఆందోళన కలిగిస్తోంది. ఈ రెండు నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందించే ఏకైన అస్పత్రి ఎమ్మిగనూరు విధాన పరిషత్ ప్రాంతీయ వైద్యశాల. రెండు నియోజకవర్గాల ప్రజలకు వైద్యం అందించడంతో పాటు ప్రసవాలు చేయడంలో మంచి పేరున్న ఆస్పత్రికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2021న కోవిడ్ సమయంలో లక్షలు వెచ్చింది ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అయితే కోవిడ్ తరువాత చిన్న మరమ్మతుల కారణంగా ప్లాంట్ పనిచేయడం లేదు. నాటి నుంచి నేటి వరకు దాని మరమ్మతులను చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోలేదు. ఎలాంటి రోగికైనా అవసరమైన ఆక్సిజన్ అవసరమయ్యే ప్లాంట్‌ను మరమ్మతులు చేయించడంలో జాప్యం చేయడంతో ఆస్పత్రిలో ఆక్సిజన్ సిలిండర్లనే వైద్యులు, సిబ్బంది ఉపయోగిస్తున్నారు. వైద్య అవసరాలకోసం ఇప్పటికైనా ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొని రావాల్సి వుంది.

ముందు జాగ్రతలు పాటించాలి

ప్రజలు ముందు జాగ్రతలు పాటిస్తే కోవిడ్ వ్యాపించదు. వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు చేతులు శుభ్రంగా వుంచుకోవాలి, మాస్కులు కచ్చితంగా ధరించాలి. గుంపులు గుంపులుగా వుండకూడదు. కనీసం ఆరడుగుల దూరం అయినా పాటించాలి. కోవిడ్ లక్షణలున్న వారు వెంటనే ఆస్పత్రికి వస్తే దానికి తగ్గ చికిత్సలు అందించేందుకు సిద్ధంగా వున్నాం. అందుకు తగ్గ సౌకర్యాలను ఏర్పాటు చేశాం. ఏది ఏమైనా కోవిడ్ పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.
– అయ్యంగార్ సుధ, ఆస్పత్రి సూపరింటెండెంట్ ,ఎమ్మిగనూరు

రైతుల ఆత్మగౌరవాన్ని కాలరాసిన కూటమి


నందవరంలో మాట్లాడుతున్న విరూపాక్షిరెడ్డి

నందవరం : విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అండగా నిలిచిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి, వ్యసాయం రంగాన్ని నిర్లక్ష్యం చేసి రైతుల ఆత్మగౌరవాన్ని కూటమి ప్రభుత్వం కాలరాసిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగలా చేశారని గుర్తు చేశారు. రైతులకు వారి గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి పంటల బీమా, రైతులకు పెట్టుబడి సాయం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, సాగు పంటల్లో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు, ధాన్యం కొనుగోలు వంటి వసతులు కల్పించారన్నారు. నేడు సీఎం చంద్రబాబు నాయుడు రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేస్తూ రైతులను మోసం చేశాడని, ఏ ఒక్క పథకం రైతులకు అందించ లేదని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా మోసం చేశారని, పంటల బీమా పథకానికి కూడా మంగళం పాడేశారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు చాంద్‌బాషా, అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకోటేశ్వరరెడ్డి, ఈశ్వరరెడ్డి, వెంట్రామిరెడ్డి, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్‌గా రమాదేవి



మంత్రాలయం రూరల్ : మండల తహసీల్దార్‌గా రమాదేవి నియామితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె తుగ్గలి నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రవి తగ్గలికి బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

కోసిగి: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలని వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ మురళీనాయుడు, నియోజకవర్గ కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ 11సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం మండల కేంద్రమైన కోసిగిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ తల్లి పేరు మీద మొక్కను నాటాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, చిరుతపల్లి ఈరన్న, సీనియర్ నాయకుడు తిక్కయ్య, నాగరాజు పలువురు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: 43 రోజులుగా దీక్ష చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఇంజినీరింగ్ వర్కర్స్ యునియన్ నాయకులు రాజేంద్ర, నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలో పాల్గొని మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల కోసం ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు.

పీఆర్ ఏఈగా యమునప్ప



ఆదోని రూరల్: మండల పంచాయతీరాజ్ ఏఈగా యమునప్ప బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన హొళగుంద మండలం పీఆర్ ఏఈగా పనిచేస్తూ బదిలీపై ఆదోనికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ మాలిక్‌బాషా ఎనిమిది నెలల క్రితం కోసిగి మండలానికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆదోని మండల పీఆర్ ఏఈ పోస్టులో యమునప్ప నియమితులయ్యారు.

పని గంటల పెంపునకు వ్యతిరేకంగా నిరసనలు

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం తీసుకున్న పని గంటల పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా ఈనెల 20వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని సీఐటీయూ కార్యదర్శి పి.ఎస్. గోపాల్, ఏఐటీయూసీ కార్యదర్శి బి.వెంకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప అన్నారు. బుధవారం వారు స్థానిక మున్సిపల్ గ్రౌండ్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల, కార్మికుల పని గంటల పెంచడం ఏమిటని ప్రశ్నించారు. పనిగంటల పెంపుతో కార్మికులు, అన్నివర్గాల ఉద్యోగులు ఇబ్బందులు పడతారన్నారు. వెంటనే పాత పని విధానాన్ని అమలు చేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో కార్మికులు, అన్నివర్గాల ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తిప్పన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు

ఆదోని రూరల్: ఆదోని నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించేంతవరకు సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యిందన్నారు. పట్టణంలో మురుగు కాలువలు సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్ల లోకి మురుగు నీరు చేరి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఈనెల 22వ తేదీన జరగనున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భీమేష్, నాగరాజు, నాయకులు బసాపురం గోపాల్, మదిరి ఎల్లప్ప, కొత్తూరు గంగన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

గోనెగండ్ల : జూన్ 21న అంతర్జాయతీ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ మణి మంజరి, ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో యోగాపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జూన్ 21న యోగా కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకు అనుగుణంగా అన్ని పంచాయతీల్లో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారి గిడ్డయ్య మాదిగ

ఆదోని రూరల్: మండలంలోని ధణాపురం గ్రామంలో దళిత సర్పంచ్‌ను అవమానించిన కూటమి నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారి గిడ్డయ్య మాదిగ, జిల్లా నాయకులు బీమా మాదిగ, టౌన్ ఇన్‌చార్జ్ మాదాస్ జగన్ మాదిగ, పట్టణ కన్వీనర్ వన్నెల మణికంఠ, టౌన్ ఇన్‌చార్జ్ గుమ్మల బాలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన ధణాపురంలో ఎమ్మెల్యే పార్థసారథి పర్యటిస్తూ, ప్రజలతో మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ క్రిస్టియన్‌నా, అందుకే రావడం లేదా అని అడగడం, పక్కనే ఉన్న టీడీపీ నేతలు, నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మ ఎస్సీ అని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. దళితులంటే ఇంత చిన్నచూపా అని ప్రశ్నించారు. వెంటనే ఎమ్మెల్యే, కూటమి నాయకులు బహిరంగంగా దళిత సర్పంచ్‌కు క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దతుత మాదిగ, సుధాకర్ మాదిగ, హుసేనప్ప మాదిగ, ఎంఎస్‌పీ నాయకులు శాంతిరాజు మాదిగ, అంజినప్ప మాదిగ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జా అవాస్తవం


మాట్లాడుతున్న బెట్టనగౌడ్

కోసిగి: భూ కబ్జాలను చేశామంటూ ఓ దిన పత్రికలో లేనిపోని ఆరోపణలు చేస్తూ వార్తలు రాయడం సరి కాదని కోసిగి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బెట్టనగౌడ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పూర్వీకులకు 800 ఎకరాల భూమి ఉండేదన్నారు. కుటుంబ విభజనలో భాగంగా మా వంశీయులు భూములు పంచుకోగా అందురు సాగు చేసుకుంటున్నారని, మరి కొంతమంది వారి అవసరాల నిమిత్తం అమ్ముకున్నారని తెలిపారు. వారసత్వంగా వస్తున్న భూములు సాగుచేసుకుంటున్నామని తెలిపారు. కానీ పత్రికలో మా సొంత పొలాల సర్వే నెంబర్లు రాసి పోషక్ ఫారెస్ట్రీ అండ్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీ భూములను తనతో పాటు మురళీమోహన్‌రెడ్డి, గంగధర్ స్వామి, పలువురు రైతులు ఆన్‌లైన్‌లో పేర్లు మార్పిడి చేసుకున్నారని ఆరోపణలు చేయడం విడ్డురంగా ఉందన్నారు. నాకు తెలిసినంత వరకు మా ప్రాంతంలో ఆ సంస్థ పేరు మీద ఒక్క ఎకరా భూమి కూడా రిజిస్టర్ కాలేదన్నారు. నిజాలు తెలుసుకోకుండా, ఎలాంటి విచారణ చేయకుండా రిటైర్డ్ డీఎస్పీ భాస్కర్‌నాయుడు చెప్పిన మాటల ఆధారంగా ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ప్రతిపక్ష పార్టీలో ఉన్నామని రాజకీయంగా అణుగుదొక్కలని కుట్రలు పన్నడం సరికాదన్నారు.

జీవితంలో యోగా ఎంతో ముఖ్యం


యోగాసనాలు చేస్తున్న ఉపాధి కూలీలు

పెద్దకడబూరు : ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఎంతో ముఖ్యమని సీనియర్ మేటీ తలారి అంజి అన్నారు. మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశంలో బుధవారం ఉపాధి కూలీల చేత యోగాసనాలు వేయించారు.

తల్లికి వందనం వర్తింపజేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని మున్సిపల్ వర్కర్స్ యునియన్ కార్యదర్శి ఇస్మాయిల్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో యునియన్ నాయకులు కేసన్నఖాజ, మునీంద్ర, రంగస్వామి, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్షయవ్యాధికి చికిత్స


మాట్లాడుతున్న డాక్టర్ జాహ్నవి

ఎమ్మిగనూరుటౌన్: క్షయ వ్యాధిని ముందుగా గుర్తిస్తే చికిత్స తీసుకోవడం ద్వారా త్వరగా నయం అవుతుందని వైద్యాధికారిణి జాహ్నవి, ఎంపీహెచ్ఈఓ విజయకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఖిబ్‌లా కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎస్సీ కాలనీ 2వ సచివాలయంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ 2వారాలకు మించి జ్వరం, దగ్గు, గళ్ల పడటం, గళ్లలో రక్తం రావడంతో పాటు బరువు తగ్గడం , ఆకలి లేకపోవడం లాంటి లక్షణాలున్న వారు పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ సుమలత, డబ్ల్యూహెచ్ఎస్ నాగమ్మ, ఆశా వర్కర్ లక్ష్మి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టండి


గోనెగండ్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి

గోనెగండ్ల: గత ప్రభుత్వంలో ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ డీఈ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు బేస్‌మెంట్, వివిధ స్టేజీలలో ఇళ్లు నిర్మించి నిలిపివేశారన్నారు. అలాంటి వారు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టి పూర్తి చేయాలన్నారు. లేకపోతే పట్ట, మంజూరైన ఇల్లు రద్దు చేసి ఇతరులకు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ షేక్షావలి, సర్వేయర్లు, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై దృష్టి పెట్టండి


రెవెన్యూ కార్యాలయంలో అర్జీలు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ

మంత్రాలయం రూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ ఆదేశించారు. బుధవారం ఆమె స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజలు ద్వారా వచ్చిన అర్జీలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కలెక్టరేట్ నుంచి వచ్చిన ప్రజా అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఆమెతోపాటు తహసీల్దార్ రమాదేవి, వీఆర్వోలు ఉన్నారు.

సమష్టిగా శ్రమిద్దాం.. పార్టీని బలోపేతం చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- పార్టీ ఆదోని మున్సిపాలిటీ కమిటీ ఏర్పాటు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్‌రెడ్డితో వై.పి.గంగాధర్, అనుచరులు

ఆదోని టౌన్: సమష్టిగా శ్రమిద్దామని వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దామని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదోని మున్సిపాలిటీ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో ఎవరికి ఏ సమస్య వచ్చినా కలిసికట్టుగా ఎదుర్కొందామని, ఎంతటి సమస్య అయినా ఆదోని, జిల్లా కమిటీ, అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలకు ఎన్నో కష్టాలు ఎదురవుతున్నా పార్టీ కోసం పాటుపడుతూనే ఉన్నారన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వ నాయకులు లేనిపోని కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని, అందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు, మహిళలు పాటుపడాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. ప్రజాభిమానమే పార్టీకి కొండంత అండ అని చెప్పారు. మున్సిపాలిటీని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 24 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారని జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

పనిచేసేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు

వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పనిచేస్తున్న అభిమానులు, కార్యకర్తలు ఘనంగా సన్మానం చేస్తూ వారి సేవలను గుర్తించడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఎల్లవేళలా ఉంటుందన్నారు. పార్టీని బలోపేతం చేసుకుందామని, అందుకు ప్రతిఒక్కరు తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యిందని, మరో నాలుగేళ్లపాటు పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆదోని నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు.

ఆదోని మున్సిపాలిటీ కమిటీ

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదోని మున్సిపాలిటీ కమిటీని ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఆదోని పట్టణాధ్యక్షులుగా బి.దేవా, వైస్ ప్రెసిడెంట్లుగా ఉప్పర నారాయణ, చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీలుగా గంగాధర్, గాజుల నాగరాజు, తాయన్న, యల్లప్ప, సెక్రటరీలుగా టిప్పు, రాజశేఖర్‌గౌడ్, చాకలి వెంకటేష్, లక్ష్మన్న, నల్లారెడ్డి, ట్రెజరర్‌గా గొల్ల మునిస్వామి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పోతురాజు నాగరాజు, కల్లుపోతుల కోదండరామ్, మహబూబ్‌బాషా, రాయనగర్ ఈరన్న, బోయ చంద్రశేఖర్, చంటి, వాల్మీకి వీరాంజనేయులు, ఉచ్చీరప్ప, బాబాఫకృద్దీన్, ఎరుకల లక్ష్మన్న, రంగస్వామి ఉన్నారు.

దళిత సర్పంచ్‌ను అవమానించడంపై విచారణ చేపట్టాలి

ఆదోని మండలం ధణాపురం గ్రామంలో దళిత సర్పంచ్‌ను అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాజీఎమ్మెల్యే డిమాండ్ చేశారు.స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు కావొస్తున్నా నేటికీ అంటరానితనం, వివక్షత చూపడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తాయన్న, వేణు, ఈరన్న, గోపాల్, కుంకనూరు వీరేష్, ఈరన్న, కామాక్షి తిమ్మప్ప, బాలు, గోపాల్, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

నందవరం : రైతులు పత్తి పంట సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ సరిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని హాలహర్వి గ్రామ పంచాయతీ పరిధిలోని బాపురం గ్రామ రైతు భీమన్న పొలంలో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..రైతులు పంటల సాగులో విత్తన శుద్ధి చేసుకోవాలని, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ కాజా ఉసేని, ఎంపీఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

కౌతాళం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ సోమ్లానాయక్ అన్నారు. బుధవారం కౌతాళంలోని ఎన్టీఆర్ నగర్‌లో ప్రజలకు అవగహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి వున్నప్పుడే ఎలాంటి తగాదాలు జరగవన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, ఎవరికీ కూడ ఓటీపీలు చెప్పకూడదన్నారు.

రూ.లక్షల్లో ఫీజులు.. వసతులు శూన్యం

ఎమ్మిగనూరుటౌన్: నారాయణ కళాశాలలో విద్యార్థుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని, అయితే అందుకు తగ్గట్టుగా వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, ఖాదర్, సహాయకార్యదర్శి దస్తగిరి ఆరోపించారు. బుధవారం స్థానిక నారాయణ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అధికారులు సత్వరం కళాశాలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు


మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న కర్రెప్ప, పెద్దహరివాణం గ్రామస్తులు

ఆదోని రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ వింగ్ జనరల్ సెక్రటరీగా కర్రెప్పను వైఎస్సార్‌సీపీ కేంద్ర పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేశారు. ఈ మేరకు కర్రెప్ప బుధవారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పెద్దహరివాణం గ్రామ నాయకులు, వైస్ ఎంపీపీ వీరేష్, వైస్ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, నాయకులు మెడికల్ నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్‌కు పరామర్శ


మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్ తిరుమల రెడ్డిని పరామర్శిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

గోనెగండ్ల : మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామానికి చెందిన మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంజిహళ్లి తిరుమల రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పరామర్శించారు. తిరుమల రెడ్డి కొంత కాలంగా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. మంగళవారం తిరుమల రెడ్డిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలులోని గౌరిగోపాల్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఆస్పత్రికి చేరుకొని తిరుమల రెడ్డిని పరామర్శించి ఆయనకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జాన హరికృష్ణ, వీరేష్, నరేష్ రెడ్డి, వెంకటేష్, తోలు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారికి సన్మానం

పెద్దకడబూరు : సాధారణ బదీలలో భాగంగా కోసిగి మండలానికి వెళ్లిన మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్‌ను మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మండల వ్యవసాయాధికారిణి సుచరిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన సభలో పలువురు వ్యక్తులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల నాయకులు గజేంద్రరెడ్డి, యల్లప్ప, సీపీఐ నాయకులు వీరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయాధికారి వరప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

డ్రైనేజీ నీటిని తొలగించండి


నిరసన వ్యక్తం చేస్తున్న దొడ్డి గ్రామస్తులు

కోసిగి : మండల పధిలోని దొడ్డి గ్రామ ప్రాథమిక పాఠశాల వద్ద ప్రధాన రోడ్డులో నిలిచిన డ్రైనేజీ నీటిని తొలగించాలని రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, గ్రామస్తులు తాయన్న, హనుమంతు, నరసయ్య, నరసింహులు కోరారు. బుధవారం గ్రామంలో నిలిచిన డ్రైనేజీ నీటి వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ..డ్రైనేజీ నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని, విద్యార్థులు ఆ నీటిలో నుంచి నడుచుకుని పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు.